


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

మెదక్
సంగారెడ్డి
సిద్దిపేట

మంగళవారం 19 ఆగష్టు 2025


## యూరియా పక్కదారి పట్టించే వారిపై

# ఉక్కుపాదం మోపాలి

టాస్క్ ఫోర్స్ బృందాలతో గట్టి నిఘా ఏర్పాటు చేయాలి.

వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు.

కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లతో వీ.సీలో మంత్రి తుమ్మల, సీ.ఎస్ వెల్లడి.

సజావుగా పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని దిశానిర్దేశం.



**సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి.....**
వ్యవసాయ అవసరాల కోసం కేటాయిస్తున్న యూరియా ఎరువులను పక్కదారి పట్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు స్పష్టం



చేశారు. సోమవారం వారు రాష్ట్ర సచివాలయం నుండి వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్, సంచాలకులు గోపి తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయా జిల్లాలలో అందుబాటులో ఉన్న యూరియా ఎరువుల నిల్వలు, పంపిణీ తీరుతెన్నులను సమీక్షిస్తూ, కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఇతర శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను నియమించుకుని, ఎక్కడ కూడా యూరియా ఎరువులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని మంత్రి తుమ్మల సూచించారు. ముందస్తుగానే

మిగతా 2 లో..

## మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్

సింగూర్ ప్రాజెక్టులో క్రమేపి పెరుగుతున్న నీటిమట్టం.

రానున్న 48 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు.

ప్రజలు అత్యవసరం అయితేనే ఇళ్ళ నుండి బయటకు రావాలి.

జనజీవనం స్తంభించిపోకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తక్షణ చర్యలు.

క్షేత్రస్థాయిలో ప్రజలను రక్షించేందుకు జిల్లా పాలన యంత్రాంగం సిద్ధంగా ఉంది.

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

2 లో..



## అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ రాహుల్ రాజ్



2 లో..

## అదే హోరు... తగ్గని

# మంజీర జోరు

### జలదిగ్బంధంలోనే దుర్గామాత ఆలయం



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలు.

### విగ్రహానికి పూలమాల వేసిన మంత్రి.



**సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి....**
వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన .సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవం పురస్కరించుకొని, సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నూతన విగ్రహాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సర్దార్ పాపన్న పోరాటాలు, త్యాగాలు వెనకబడిన వర్గాల గౌరవాన్ని కాపాడటమే కాకుండా సామాజిక సమానత్వానికి మార్గదర్శకమయ్యాయని అన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకలుగా జరపడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ సి చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గం శాసన సభ్యులు చింతా ప్రభాకర్ ,జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**సిద్ధిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్......**
ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి వారి సమస్యలపై అర్జీల ను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారానికి 114 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం పై విశ్వాసంతో ప్రజావాణి కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఎంతో విశ్వాసంతో వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను అందజేస్తారని వాటిని ప్రతి ఒక్క శాఖ అధికారి ప్రత్యేకంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్, రెవెన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో మరియు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యూరియా పక్కదారి పట్టించే వారిపై

# ఉక్కుపాదం మోపాలి

(మొదటి పేజీ తరువాయి..)

రుతుపవనాలు ప్రవేశించి సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడం వల్ల పత్తి, వరి, మొక్కజొన్న తదితర అన్ని రకాల పంటలను రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఏకకాలంలో సాగు చేస్తున్నారని అన్నారు. దీంతో గత సంవత్సరంతో పోలిస్తే, ఈ సీజన్ లో ఇదే సమయానికి ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలను ఎక్కువ మొత్తంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. అయితే, అనేక కారణాల వల్ల కేంద్రం నుండి రాష్ట్ర అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు రాష్ట్రానికి రావడం లేదని, కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇంకనూ రావాల్సి ఉందని మంత్రి వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న ఎరువులను, ప్రత్యేకించి యూరియా నిల్వలను సజావుగా పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు హితవు పలికారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలోని ఆయా మండలాల వారీగా సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను నిరంతరం పరిశీలన చేస్తూ, అవసరం ఉన్న ప్రాంతాలకు సర్దుబాటు చేయాలని సూచించారు. ఎక్కడ కూడా యూరియా స్టాక్ లేదు అనే అభద్రతా భావం రైతుల్లో నెలకొనకుండా, వారి అవసరాలకు సరిపడా యూరియాను అందించేలా అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు. ఎరువుల స్టాక్ కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ, వారిలో నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. యూరియా అక్రమ రవాణా జరగకుండా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించకుండా కోళ్ల ఫారాలు, పేపర్ మిల్లులు, ఆయా పరిశ్రమలలో తనిఖీలు జరపాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలకు ఆనుకుని ఉన్న సరిహద్దు ప్రాంతాలలో ప్రత్యేకంగా చెక్ పోస్ట్ లను నెలకొల్పి, యూరియా ఎరువులు దారి మళ్ళకుండా చూడాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో పోలీసు శాఖ కూడా క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. అదే సమయంలో యూరియాను అవసరానికి మించి వినియోగించకుండా, ఒకేసారి ఏకమొత్తంలో యూరియా కొనుగోలు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

యూరియా ఎరువులు జిల్లా సరిహద్దులు దాటనివ్వం : జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య .

జిల్లాలో ఎక్కడ కూడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచడం జరిగిందని కలెక్టర్ పి ప్రావీణ్య స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు లు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జిల్లా ఎస్ పి పారితోష్ పంకజ్ తో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా అనునిత్యం పర్యవేక్షణ జరపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఒక్క ఎరువు బస్తా కూడా అక్రమంగా జిల్లా సరిహద్దులు దాటి వెళ్ళకుండా గట్టి నిఘా కొనసాగించాలని అన్నారు. సొసైటీలలో ఎరువుల స్టాక్ ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రైవేట్ విక్రయ కేంద్రాలను కూడా మండల వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేసేలా చూడాలన్నారు. ఎక్కడైనా ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడడం, బ్లాక్ మార్కెట్ కు తరలించడం, నిర్ణీత ధర కంటే ఎక్కువ ధరకు విక్రయాలు జరపడం, ఎరువులను పక్కదారి పట్టించడం వంటివి గుర్తిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ తో పాటు వచ్చే రబీ సీజన్ లో కూడా ఎరువుల కొరత నెలకొనకుండా ఇప్పటినుండే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ ,జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్ ,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు.

సంగారెడ్డి మేజర్ న్యూస్.

బడుగు, బలహీన వర్గాల ప్రజలను వేధించిన వారిపై పోరాటం చేసి సామాజిక న్యాయం సాధించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శనీయం అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సరికొత్తగా నిర్మించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు గౌడ కులస్తులు నిర్వహించిన బైక్ ర్యాలీని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించిందని గుర్తు చేశారు.

కలెక్టరేట్ ఎదుట పాపన్న విగ్రహానికి స్థలాన్ని కేటాయించడం, అలాగే జిల్లా గౌడ సంఘ భవన నిర్మాణానికి 1 ఎకరా స్థలం, నిధులు మంజూరు చేసిన విషయాన్ని వివరించారు.ప్రస్తుత ప్రభుత్వం భవనం పూర్తయ్యే వరకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజు గౌడ్ ఆర్ శ్రీనివాస్ గౌడ్ సురేందర్ గౌడ్ గౌడ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గౌడ సమాజస్థులు పాల్గొన్నారు.



# మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్

రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు.సోమవారం ఆయన తూప్రాన్ మండలం కిష్టాపూర్ గుండ్రెడ్డిపల్లి వెళ్లే రహదారి పై వెళ్తున్న హల్దీ వాగును ,వెల్దుర్తి మండలం వెల్దుర్తి ఉప్పిలింగాపూర్ రోడ్ లోని హల్దీ పై ఉన్న బ్రిడ్జిని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు మన పక్క జిల్లాలో కూడా భారీ నుండి అతి భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో దూర ప్రాంత పర్యటనలు వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రెవెన్యూ పోలీస్ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు జాయింట్ బృందాలు ఏర్పాటు చేసి యావత్ జిల్లా యంత్రాంగం ప్రజలకు రక్షణగా ఉందని భరోసా కల్పిస్తూ ప్రజలకు తక్షణ సహాయ సహకారాలు అందించాలన్నారు ఎక్కడైనా రోడ్లు తెగిపోవడం వంటివి జరిగితే, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని, చెప్పారు.. పొంగి పొర్లుతున్న వాగులు దాటకుండా పటిష్ట బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేసేలా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు చెప్పారు చెరువులు, వాగులు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రిస్తున్నట్లు వివరించారు.క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య తాసిల్దారులు, పంచాయతీ సెక్రటరీలు సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

పాపన్నపేట మేజర్ న్యూస్

సోమవారం కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాపన్నపేట మండలం ఎల్లాపూర్ బ్రిడ్జి వద్ద మంజీరా ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద ఉధృతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు ముఖ్యంగా పశువుల కాపరులు, రైతులు, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిసర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళరాదని హెచ్చరించారు. అధికారులు నిరంతరం 24 గంటలపాటు అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు.

## అదే హోరు... తగ్గని

# మంజీర జోరు

పాపన్నపేట మేజర్ న్యూస్:

గత కొన్ని రోజులుగా భారీ ఎత్తున కురుస్తున్న వర్షాలకు తోడు సింగూరు ప్రాజెక్టు నుండి పెద్ద ఎత్తున నీటిని విడుదల చేయడంతో మంజీరా పరవళ్ళు అలాగే కొనసాగుతున్నాయి . దీంతో ఏడుపాయల వన దుర్గ భవాని మాత ఆలయం నాల్గవ రోజు సైతం మూసి ఉంచారు . దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని రాజా గోపురం లో ఉంచడంతో ఏడుపాయలకు వచ్చిన భక్తులు అమ్మవారిని రాజగోపురంలోనే దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. నిన్న ఆదివారం సెలవు దినం కావడం మూలంగా భక్తుల సంఖ్య అధిక మొత్తంలో ఉండే. కానీ సోమవారం సెలవు దినం కాకపోవడంతో పాటు పొద్దస్తమానం వర్షం పడడం మూలంగా భక్తుల సంఖ్య, పర్యాటకుల సంఖ్య అంతంతమాత్రంగానే ఉంది. అయితే సోమవారం సాయంత్రానికి సుమారు 70 వేల క్యూసెక్కుల నీరు వన దుర్గా ప్రాజెక్టు నుండి నిజాంసాగర్ వైపు అమ్మవారి ఆలయం ముందు నుండి పరుగులు పెడుతుంది. వరద తగ్గుముఖం పడితే ఆలయం పున ప్రారంభిస్తామని ఆలయ సిబ్బంది వెల్లడించారు. వరద ప్రభావాన్ని అడిషనల్ ఎస్పీ పరిశీలించారు ఏడుపాయలలో ఏలాంటి సంఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తగిన బంధోబస్త్ చర్యలు చేపట్టారు .

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు డిఎంహెచ్ఓ

## సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనీ సూచన

## అదనపు డిఎంహెచ్ఓ డా. సృజన



**మెదక్ మేజర్ న్యూస్**

కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సృజన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలనీ అన్నారు. వరుసగా మూడు రోజుల పాటు జ్వరము ఉన్నట్లైతే ఖచ్చితంగా డాక్టర్ని సంప్రదించాలనీ తెలిపారు. జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారికి వెంటనే రక్త పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం చేయాలని సిబ్బందికి సూచన చేశారు. ఇన్ పేషంట్లను కలిసి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో హెల్త్ ఆఫీసర్, సిహెచ్ఓ ఎలిజబెత్ రాణి సిబ్బంది ఉన్నారు.

# కల్వేటును సందర్శించిన తూప్రాన్ డిఎస్పి నరేంద్ర గౌడ్

**మెదక్ మేజర్ న్యూస్**



తూప్రాన్ సర్కిల్ పరిధిలోని శివంపేట్ కల్వర్ట్‌ను సందర్శించారు. తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, సీఐ రంగ కృష్ణ కలిసి కల్వేటు తీవ్రంగా దెబ్బతినడంతో వారు మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల వాగులు చెరువులు నిండి ప్రవహించడంతో అత్యవసరమైతే తప్ప ఇంట్లో నుండి రావద్దని 48 గంటలు భారీ వర్షాలు ఉన్నాయని అలాగే భారీ వర్షాలకు అందరూ అప్రమత్తంగా ఉండాలని వారు పేర్కొన్నారు, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ కల్వర్ట్ తీవ్రంగా దెబ్బతింది. ప్రస్తుతం వర్షపు నీరు పాంబండా చెరువు నుండి పోతుల బోగుడ చెరువు వైపు తీవ్రంగా ప్రవహిస్తూ ఉండటంతో కల్వర్ట్‌కు ముప్పు ఏర్పడింది. ఈ నీటి ప్రవాహం కారణంగా గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు పరిస్థితిని పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచనలు అందజేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలు నివారించాలని సూచించారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

# లక్ష్మీ నరసింహ స్వామినీ నమ్మినవారికి సకల శుభాలు:



**మెదక్ మేజర్ న్యూస్**

కొల్చారం ప్రతి సవంత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కొల్చారం మండలం గ్రామం అప్పాజీపల్లి గ్రామం లో శ్రావణమాసం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి అభిషేకం అలంకరణ పూజ కార్యక్రమాలు కన్నుల పండుగ జరిగింది తదుపరి అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది లక్ష్మీనరసింహస్వామినీ న మ్ముకుంటే అన్ని సుఖ సంతోషాలు వెంకట్ గౌడ్ ( గజిని) భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు ఈ కార్యక్రమంలో నాయిని సునీతా వెంకట్ గౌడ్ (మాజీసర్పంచ్ ) కన్నీబోయిన ధనరాజ్ (ముదిరాజ్ సంఘము అధ్యక్షులు)సదాల తిరుపతి. తిమ్మాకాపల్లి గోపాల్, నర్సింలు, పితిరి రవి, శ్రీహరి, చింతల కిషన్, భాగయ్య, వేణు. శరత్, కొరంపల్లి వెంకటేశం, రాజు ,అనిల్, చింతల కృష్ణా, మహేష్, బిక్షపతి, యువకులు పెద్దలు, మహిళలు గ్రామస్థులు అందరూ పాల్గొని విజయవంతం చెయ్యడం జరిగింది

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

**టేక్మాల్ సూర్య మేజర్ న్యూస్.**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధన సమితి టేక్మాల్ మండల శాఖ ఆధ్వర్యంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యొక్క 375 వ జయంతి ఉత్సవాలు టేక్మాల్ మండల కేంద్రంలోని స్థానిక గాంధీ భవన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల పార్టీ అద్యక్షులు నిమ్మ రమేష్,యువజన కాంగ్రెస్ అద్యక్షులు సంగమేశ్వర్ గౌడ్,వివిధ పార్టీల నాయకులు,ఆకులపల్లి పాపయ్య,రాజేష్ గౌడ్,నాయికోటి భాస్కర్,షేక్ మజర్,చింత రవి,కమ్మరి సిద్దన్న,అశిలి సాగర్,చల్ల అనిల్,సేవాలాల్,సక్ర నాయక్,సర్ధార్,సంతోష్,వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు,మనోహర్ గౌడ్,సత్య గౌడ్,అనిల్ గౌడ్,తుకారం గౌడ్,నగేష్ గౌడ్, నాగరాజ్ గౌడ్,రాజు గౌడ్,సంపత్ గౌడ్,వెంకట్ గౌడ్,సాయిశేషు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత

## ప్రభుత్వ భూమి లో యదేచ్ఛగా అక్రమ మట్టి దందా



**సిద్దిపేటరూరల్, మేజర్ న్యూస్:**

ప్రభుత్వ భూమి నుండి యదేచ్చగా ప్రైవేట్ స్థలాలకు అక్రమంగా టిప్పర్ లు, ట్రాక్టర్ లలో మట్టి తరలింపు రూరల్ మండలంలోని ఇరుకొడు, చిన్నగుండవెల్లి గ్రామాలలో జోరుగా కొనసాగుతుంది. గ్రామాలలో నుండి ఇష్టారీతిన టిప్పర్లు, ట్రాక్టర్లు నడపడం తో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ ల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి లో మట్టి తవ్వకాలు చేపడుతుండగా, అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొంతమంది మట్టి వ్యాపారస్తులు యదేచ్చగా ఎర్రమట్టిని సిద్దిపేట నూతన వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మట్టి దందా పై మైనింగ్, పోలీస్, రెవెన్యూ విభాగాల అధికారులు ఆరా తీస్తున్నట్టుగా పైకి చెబుతున్నా లోలోన మాత్రం వీరి అనుమతులతోనే యదేచ్ఛగా ఈ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. లేకపోతే అడ్డు అదుపు లేకుండా, విచ్చలవిడిగా మట్టిని వ్యాపారాలు ఎలా తరలిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అక్రమ మట్టి దందా పై సంబంధిత విభాగాల అధికారులు అందరూ దృష్టి సారించి కట్టడి చేయాలని, పలువురు అంటున్నారు.



# ప్రజలందరూ సురక్షితంగా ఉండాలి

**అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి..**



.భారీ వర్షాలను దృష్టి లో పెట్టుకొని వాతావరణ శాఖ చేసిన భారీ వర్షసూచన నేపథ్యంలో. సోమవారం అడిషనల్ కలెక్టర్ నాగేష్ చిట్కుల్ చాముండేశ్వరి బ్రిడ్జ్, భద్రియా తాండ లో పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ. వరద ప్రవాహ తాకిడి ఎక్కువ ఉందని భద్రత కట్టుదిట్టం చేయాలని అన్నారు. భద్రి తాండ కట్ట డ్యామేజ్ ను మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. చెరువులు, గండ్లు ఉంటే ఇరిగేషన్ శాఖ అధికారులకు, గ్రామాలలో వర్షానికి ఇల్లు కూలిపోయిన పాక్షికంగా దెబ్బతిన్న వెంటనే పంచాయతీ సెక్రెటరీలు తాసిల్దార్ కు రిపోర్టు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్ సహదేవ్, జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానందం, ఎంపీడీవో ప్రశాంత్, నిత్యానందం, ఏపీవో శ్యామ్, ఇన్చార్జ్ ఎంపీఓ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# నేరస్థులు చట్టం నుండి తప్పించుకోలేరు

## పోలీస్ కమీషనర్...... అనురాధ

**సిద్ధిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్.......**
మానభంగం , ఫోక్సో కేసులో నేరస్తునికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, 5 వేల రూపాయల జరిమాన వేసినట్లు పోలీస్ కమీషనర్ అనురాధ సోమవారం రోజున పత్రికా ప్రకటనలో తెలిపారు.సిపి తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఫిర్యాది 16 ఏప్రిల్ 2022 రాత్రి 10.30 గంటలకు తన 14 సంవత్సరాల కూతురు బహిర్భూమికి వెళ్లగా పర్స శ్రీనివాస్ తండ్రి రాజయ్య, వయస్సు 48 సంవత్సరములు, గ్రామం ఎనగుర్తి, మండలం దుబ్బాక, జిల్లా సిద్దిపేట కు చెందిన నేరస్థుడు అరవకుండా నోటిలో చున్నీ కుక్కి తన కూతురును అత్యాచారం చేసినాడని 18 ఏప్రిల్ 2022 నాడు ఫిర్యాదు చేయగా అప్పటి స్థానిక ఎస్సై కేసు నమోదు చేయగా అప్పటి సీఐ కృష్ణ కేసు పరిశోధన చేసి నేరస్థుని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కు పంపించడం జరిగిందన్నారు.తదుపరి పరిశోధన లో టెక్నికల్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత కేసు పరిశోధన పూర్తిచేసి నేరస్తునిపై కోర్టులో చార్జిషీట్ వేయడం జరిగిందన్నారు.నాటి నుండి 18 ఆగస్టు 2025 వరకు సిద్దిపేట మొదటి అడిషనల్ డిస్టిక్ ,సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగిందన్నారు.మొదటి అడిషనల్ డిస్టిక్ , సెషన్స్ జడ్జి జయప్రసాద్ ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తుని పై నేరం రుజువైన నందున పై నేరస్తునికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, 5 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. నిష్పక్షపాతంగా కేసు ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు విధులు నిర్వహించే అధికారులను సిబ్బందిని సిపి అభినందించారు. త్వరలో సన్మానించి నగదు పురస్కారం అందజేస్తామని తెలిపారు.



## ప్రమాదాల నివారణకు చర్యలు



**చేర్యాల మేజర్ న్యూస్....**
చేర్యాల మండలం కడవేర్గు గ్రామశివారులోని హైలెవల్ బ్రిడ్జి నిర్మా ణం పూర్తయిన ఆర్అండ్ బీ రోడ్డు లెవల్ పూ ర్తికాకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరు గుతున్నాయి. దీంతో ఈ విషయాన్ని ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి దృష్టికి తీసుకెళ్లా రు. ఎమ్మెల్యే స్పందించి కడవేర్లు తాజా మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరికి ఫోన్ చేసి హైలెవల్ బ్రిడ్జి ఆర్అండ్ బి రోడ్డు, కుప్ప లను చదునుచేసి తాత్కాలికంగా రోడ్డువేసి వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో స్పందించిన మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరి ఆయా గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్త లు, రైతులతో కలిసి ఆదివారం మట్టి కుప్పల తో పాటు తాత్కాలికంగా హైలెవల్ ఆర్ అంబీబీ రోడ్డును చదును చేసి వాహనాల రాకపో కలు సాగడానికి సదుపాయం కల్పించారు. సమస్యను చెప్పిన వెంటనే స్పందించి పను లు చేయించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డికి కడవేర్లు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, నాగ పురి. శభాషూడెం ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులకు నులిపురుగుల నివారణ కార్యక్రమం

**ముఖ్య అతిథిగా హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి**



**మెదక్ మేజర్ న్యూస్**
మండల పరిధిలోని తునికి మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో సోమవారం నులిపురుగుల నివారణదకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలోనీ విద్యార్థులకు నులిపురుగుల నివారణకు సంబంధించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చక్కగాచదువుకొవాలని తమ ఆరోగ్యంపై శ్రధవహించలని అన్నారు. విద్యార్థి ఎమ్మెల్యే చిత్ర పటం గీసి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కి బహూకరించాడు.ఎంతో సంతోషించిన ఎమ్మెల్యే విద్యార్థికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి కౌడిపల్లి మండల ఎంఈఓ బాలరాజు మరియు పాఠశాల ప్రిన్సిపల్ హరిబాబు, డాక్టర్ శ్రీకాంత్, ప్రాథమిక వైద్య బృందం, పాఠశాల అధ్యాపక బృందం, మాజీ సర్పంచ్ లు మహిపాల్ రెడ్డి, లింగం, అమర్ సింగ్, నాయకులు దుర్గా రెడ్డి, మాజీ ఎంపిటిసి ప్రవీణ్ కుమార్, సంతోష్ గౌడ్, తదితరులు పాల్గొనడం జరిగింది.



## పద్మశ్రీ అవార్డు గ్రహీత, మందకృష్ణ మాదిగకు ఆహ్వానం.



**వట్టిపల్లి సూర్య మేజర్ న్యూస్.**
వట్టిపల్లి మండల కేంద్రంలో సోమవారం నాడు ,ఎంఆర్పిఎస్ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసినారు .ఈనెల 24వ తేదీన జోగిపేట లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ,మందకృష్ణ మాదిగ కు, పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా, సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపినారు. ఈ సభకు వట్టిపల్లి మండల గ్రామ గ్రామానగల ఎంఆర్పిఎస్ సభ్యులందరూ తరలిరావాలని కోరినారు. ఈ సమావేశంలో సంజీవయ్య అర్జునయ్య, కృష్ణ ,సంతోష్, రాములు ,లింగయ్య ,శివయ్య, సాయిలు, ప్రభాకర్, రవీందర్ కళ్యాణ్, నరసింహులు, శ్రీను, నాగేష్, అఖిల్, భూమయ్య, నవీన్ కుమార్ మొదలగు వారు పాల్గొన్నారు.

## వట్టిపల్లి ప్రెస్ క్లబ్, నూతన కార్యవర్గం ఎన్నిక.

**వట్టిపల్లి సూర్య మేజర్ న్యూస్.**
వట్టిపల్లి ,మండల కేంద్రంలో శుక్రవారం నాడు వట్పల్లి ప్రెస్ క్లబ్ సభ్యుల సమావేశము జరిగినది. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .అధ్యక్షుడిగా జగన్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా దాసయ్య, సతీష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా బాగయ్య ,ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కార్యదర్శిగా సిహెచ్ నరసింహారెడ్డి, కోశాధికారిగా షఫీ, సలహాదారుగా మల్లేశం ,సభ్యులుగా శ్రీశైలం ,శ్రీపాధచారి, విజయ్. మోశ క్లబ్ అధ్యక్షులు, సభ్యులందరూ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు.



## సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు.

**వట్టిపల్లి సూర్య మేజర్ న్యూస్.**



వట్టిపల్లి మండల కేంద్రంలో స్వతంత్ర సమరయోధుడు ,సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జన్మదినంఎంతో ఘనంగా జరుపుకున్నారు .1650లో ఖిలాసాపూర్ గ్రామం, రఘునాథపల్లి మండలం, నేటి జనగామ జిల్లాలో పాపన్న గౌడ్ పుట్టినట్లు చరిత్ర చెబుతుంది. కులము గౌడ ,అతని మిత్రులు చాకలి సర్వన్న, మంగళి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమల్లు, దూదేకుల పీరు ,కోత్వాల్ మీరు సాహెబ్ ,తల్లి నర్సమ్మ ,తండ్రి ధర్మన్న ,గోల్కొండ రాజుల ,సైనికుల ఆగడాలకు ఎదురు తిరిగిన మహా ధైర్యశాలి .పాపన్న చత్రపతి శివాజీకి సమకాలికుడు. గోలకొండను స్వాధీనం చేసుకుని, ఏడు నెలల పాటు అధికారం చలాయించినాడు. కానీ 1710 లో పాపన్న తలని గోల్కొండ కోట ముఖ ద్వారానికి వేలాడదీశారు. గోల్కొండ పాలకుల పాలన ఎంత క్రూరంగా ఉండేదో ,జయంతి వేడుకలు జరుపుకునేది గొప్పవాళ్ళ ఆచరణలో మనమందరం నడవాలని . ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

## కన్నుల పండగ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి పూజలు

**మెదక్ మేజర్ న్యూస్**
మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రతి ఏటా గ్రామ ప్రజ ల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించడం జరుగుతుందని గ్రామ ప్రజలు తెలిపారు శ్రావణమాసం లో చివరి సోమవారం భాగంగా ప్రతి సంవత్సరం లక్ష్మీనరసింహస్వామి వారికి అభిషేకం అలంకరణతో పాటు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది అనంతరం గ్రామ ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలు అందరూ సుభిక్షంగా సురక్షంగా ఆయురారోగ్యాలతో ఆర్థికంగా పాడిపంటలతో విరసిల్లాలని లక్ష్మీ నరసింహ స్వామి నీ వేడుకున్నామని గ్రామ ప్రజలు తెలిపారు

## ప్రజావాణికి 28 ఫిర్యాదులు.

**సంగారెడ్డి మేజర్ న్యూస్**



ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పి ప్రావీణ్య , అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 28 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో సర్దార్ సర్వయీ పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దామోదర.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్.**

వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వయీ పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నూతన విగ్రహాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ఆవిష్కరించారు.తరువాత విగ్రహానికి పూలమాల వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, జయంతి వేడుకలను జనం ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...“సర్దార్ పాపన్న గారి పోరాటాలు, త్యాగాలు వెనకబడిన వర్గాల గౌరవాన్ని కాపాడటమే కాకుండా సామాజిక సమానత్వానికి మార్గదర్శకమయ్యాయి. ఆయన జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకలుగా జరపడం గర్వకారణం” అని అన్నారు.ఈకార్యక్రమంలో టి.జి.ఐ.ఐ.సి. చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేపల చెరువులను పరిశీలించిన, వట్టిపల్లి ఎమ్మార్వో

**వట్టిపల్లి సూర్య మేజర్ న్యూస్.**

వట్టిపల్లి మండలం, వివిధ పత్రికలలో ప్రచురితమైన, చేపల చెరువుల నిర్వహణ అనె వార్తకు స్పందించి, ఖాధిరాబాద్, ఉసిరిక పల్లి, నిర్జెప్ల గ్రామాల పొలిమెరలలో గల చేపల చెరువులను, సోమవారం మండల ఎమ్మార్వో చంద్రశేఖర్, ఇరిగేషన్ ఎయి, ఎస్సై లవ కుమార్ పరిశీలించినారు. ఈ పరిశీలనలో ఎమ్మార్వో, ఇరిగేషన్ ఎయి, ఎస్సై పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక




### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి....**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీకని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి 375వ జయంతోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకొని అప్పటి నియంతృత్వ, నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ పోరాడారని గుర్తు చేశారు. పాపన్న జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, మహనీయులు స్ఫూర్తిగా తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు.వేడుకలలో బీసీడీవో గంగా కృష్ణ,జిల్లా గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ గౌడ్ కమ్యూనిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## సదాశివపేట లో రెస్టారెంట్ ప్రారంభించిన చింత సాయినాథ్



**సదాశివపేట సూర్య మేజర్ న్యూస్**

సదాశివపేట లోని వికారాబాద్ రోడ్డు లో సోమవారం రెస్టారెంట్ ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ ప్రారంభించారు.రెస్టారెంట్ యజమాని హరిశంకర్ మాట్లాడుతూ సదాశివపేట్ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన వంటలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతా గోపాల్ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## భక్త మార్కండేయ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు.

**రామాయంపేట మేజర్ న్యూస్**

రామయంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవం సోమవారం జరిగింది. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగాయి.గణపతి హెూమం, రుద్రాభిషేకంతో మొదలైన పూజలు అన్నదానంతో ముగిశాయి. అంతకుముందు శివపార్వతుల కళ్యాణం,హెూమం జరిగింది.అలాగే ఆలయంలోని నవగ్రహాల్లో ప్రధానమైన శని భగవానుడి విగ్రహాన్ని నూతనంగా ప్రతిష్టించారు.ఈ ఉత్సవాల్లో సంఘం అధ్యక్షులు మద్దెల రమేష్,రాష్ట్ర నాయకులు మద్దెల సత్యం,బల్ల యాదగిరి,బల్ల సుధాకర్,మోహన్,కర్రె నరేందర్,కైరంకొండ రాజమౌళి,కుమార్,గజం యాదగిరి,సామల రవి, పూజారి బల్లరాజయ్య తోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు..

**రామాయంపేట మేజర్ న్యూస్**




నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం స్థానిక రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద గౌడ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ చత్రపతి అని పిలువబడే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ కులంలో పుట్టడం గర్వ కారణం అని మొగులు సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీరుడు యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ని ప్రభుత్వం పట్టించుకునే పాపను పోలేదన్నారు. ఆ మహనీయుని చరిత్రను పాఠ్యపుస్తకంలో చేర్చాలన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పైన ఏర్పాటుకు కృషి చేస్తున్నారని వచ్చే జయంతి వరకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల సభ్యులు బజార్ సిద్దా గౌడ్, వెల్దుర్తి బాల్ రాజా గౌడ్, బజార్ వెంకట గౌడ్,చంద్ర గౌడ్, బజారు చిన్న తిరుమల గౌడ్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,బజారు రంజిత్ గౌడ్, వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,అంజా గౌడ్, పర్శరాములు గౌడ్, వినయ్ గౌడ్, బొప్పాపూర్ రాజు గౌడ్, సత్య గౌడ్, చంద్రకాంత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## అవసరం మేరకే సోషల్ మీడియా వాడాలి

**సిద్దిపేట రూరల్, మేజర్ న్యూస్:**

అవసరం మేరకే సోషల్ మీడియా వాడాలని సిద్దిపేట వన్ టౌన్ ఎస్ఐ జమీరుద్దీన్ అన్నారు. సోమవారం వన్ టౌన్ పోలీసుల ఆద్వర్యంలో పట్టణంలోని సెయింట్ జాన్స్ హై స్కూల్ లో సోషల్ మీడియా వాడకంలో లాభాలు, నష్టాలు అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజలో ఉంటూ సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతున్నారని, సోషల్ మీడియా మంచికి వాడితే అది ఆభరణం అని, చెడుకు వాడితే అది ప్రమాదం అని సూచించారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఏఎస్ఐ జాకీర్ హుస్సేన్, పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, సెల్వరాజ్, కానిస్టేబుళ్లు స్వామి, కిషోర్, వెంకట్, స్వామి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి



## అదనపు కలెక్టర్ మాధురి.

**సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జయంతోత్సవ కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి , డిఆర్ఓ పద్మజరాణి , తదితరులుపూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ... పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ ఎంతో ప్రశంసనీయమైనదని కొనియాడారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో వక్తలు మాట్లాడుతూ, రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న ఆ రోజుల్లో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఓ సాధారణ వ్యక్తి కుల వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ అసామాన ధైర్య సాహసాలతో పోరాటం చేయడం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని సర్వాయి పాపన్న తెగువను కొనియాడారు. నాటి మొఘల్ రాజుల దౌర్జన్యాలను ఎండగడుతూ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను పాపన్న గౌడ్ అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలనుచాటుతోందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో , బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్,గౌడ సంఘము సభ్యులునక్క నాగరాజు గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు. జంగాగౌడ్ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం,వర్కింగ్ ప్రసిడేంట్. ప్రభుగౌడ్, జిల్లా గౌడ సంఘం వర్కింగి ప్రసిడేంట్. రాములు గౌడ్, గౌరవ అధ్యక్షులు. వీరేశం గోడ్, జనరల్ సెక్రటరి. రమేశ్ గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం ప్రదాన కార్యదర్శి. ప్రభుగౌడ్, బి.సి సంఘం అధ్యక్షులు. నరేశ్ గౌడ, వినయ్ గాడ్, డాక్టర్ రాజు గౌడ్. మనోహర్ గౌడ్, మాజీ జడ్ పి. టి,సి. డాక్టర్ స్వామి గౌడ్,మల్లా గౌడ్,శ్రీనివాస్ గౌ, మాజీ జిల్లా పరిషత్ చేర్మన్. సురేందర్ గౌడ్ కుల సంఘ నాయకులు. మల్లికార్డున్ పాటిల్ బి.సి. సంఘం జిల్లా అధ్యక్షులు. రాజేశ్వర్ స్వామి, బి.సి సంఘం ప్రదాన కార్యదర్శి,కూన వేణుగోపాల్, యువజన సంఘాల అధ్యక్షులు,నామాల నాగేష్. రజక సంఘ అధ్యక్షులు,కోంక రాజేశ్వర్, వీరశైవ లింగాయత్ ప్రదాన కార్యదర్శి,గోకుల్ క్రిష్ణ బి.సి. సంఘ నాయుకులు, సాయిలు, కుమ్మరి శాలివహన అధ్యక్షులు బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎంపీడీఓ శ్రీనివాస్



**మెదక్ మేజర్ న్యూస్**

వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు కౌడిపల్లి మండలం తడిసి ముద్దయింది. స్థానిక ఎంపిడిఓ శ్రీనివాస్ మరియు ఎంపిఓ కళిముల్ల బృందంతో కలసి సోమవారం మండలంలోనీ తునికి, రాజిపెట్, జాజి తాండాలను సందర్శించడం జరిగింది. ఇందులో భాగంగా కౌడిపల్లి గ్రామానికి చెందిన ఒంజరి బిక్షపతిపెంకుటిల్లు పాక్షికంగా ధ్వంసం అయ్యిందనీ తెలిపారు. అలాగే తునికి గ్రామంలో సంధృగు సహదేవ్, సందురి జైరాజ్, పంచమి సైయులు, రజిపేట కుషన్ గడ్డ తాండాలో పెంకుటిల్లు పాక్షికంగా ధ్వంసం అయ్యాయని జాజితాండా కు చెందిన కల్వర్టు వర్షపు నీరుపొంగడంతో తండా వాసులకు రాకపొకలకు అంత రాయం ఏర్పడింది తెలిపారు. గ్రామాల్లో పెంకుటి ఇండ్లలల్లో నివసిస్తున్న ప్రజలను అప్రత్తంగా ఉండాలనీ గ్రామస్తులను సూచించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇండ్ల వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వాన్ని నివేదికను సమర్పంచడం జరుగుతుందనీ ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంపిడిఓ శ్రీనివాస్ పేర్కొన్నారు.

# వాగులు వంకలు, పొంగి పొర్లుతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100 కు సమాచారం అందించాలి



**దుబ్బాక/మిర్ దొడ్డి మేజర్ న్యూస్:**

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అనురాధ మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్వాల్ గ్రామ శివారు కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అందె గుడికందుల అల్వాల్ గ్రామస్తులు వాగు దాటి ప్రయత్నం చేయవద్దని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చేపలు పట్టడానికి ఎవ్వరు కూడా వాగులోకి వెళ్ళవద్దని సూచించారు. వాగుకు ఇరువైపులా పోలీసు బందోబస్తు, కోన్స్ రోప్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాగుకు ఇరువైపులా ఉన్న గ్రామ ప్రజలు రైతులు పోలీస్ వారి సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. రాబోవు రెండు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా వాగులు వంకలు, పొంగిపొర్లుతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదంటే డయల్ 100 కు కాల్ చేసి తెలపాలని సూచించారు. విపత్కర పరిస్థితులలో పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, మిరుదొడ్డి ఎస్ఐ సమత, పోలీస్ సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.



# గ్రాడ్యుయేట్ పట్టా పొందిన అమూల్య.

**సంగారెడ్డి మేజర్ న్యూస్ :**

సంగారెడ్డి పట్టణానికి చెందిన అమూల్య బివిఆర్ఐటి బాచుపల్లిలో, ఐటి



గ్రూపు లో బీటెక్ పూర్తి చేసి కలశాల చైర్మన్ చేతుల మీదుగా గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా అమూల్య తనకు పాఠాలు చెప్పిన టీచర్లకు, సహకరించిన యాజమాన్యానికి, తన సహచర మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. నా యొక్క విద్యాభ్యాసనకు నా యొక్క తల్లిదండ్రులు కృషి మరువలేనిదని వారికి జీవితాంతం రుణపడి ఉంటానని పై చదువుల అభ్యసించడానికి నా యొక్క తల్లిదండ్రులు నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని విద్యలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి నా యొక్క తల్లిదండ్రుల ఆశయాలను నిలబెడతానని అందరి ప్రోత్సాహంతో నేను బివిఆర్ఐటి బీటెక్ పూర్తి చేసినానని అమూల్య తెలిపారు. నా యొక్క తండ్రి నా విద్యాభ్యాసం కోసం నిరంతరం కృషిచేసి ఎన్నో ఇబ్బందులు పడ్డ నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చారని ఏ తల్లిదండ్రులైనా సరే తమ పిల్లల భవిష్యత్తు కోసమే కృషి చేస్తారని వారు చూపించిన మార్గంలో వెళ్లాలని ఒక విద్యార్థి విజయానికి అటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, కళాశాల యజమాన్యం, ఉపాధ్యాయులు, మిత్రుల సహాయ సహకారాలు మరవనీయని విద్యార్థిని అమూల్య అన్నారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా పవిత్ర ధ్వజస్తంభం ప్రతిష్ట...

**అమీన్ పూర్ మేజర్ న్యూస్**

అమీన్ పూర్ పట్టణ పరిధిలోనీ శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని నూతన దేవాలయాల నిర్మాణాలకు అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఎల్లవేళలా అందిస్తున్నామని శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రుశ్వంత్ రెడ్డి, విజయ్ కుమార్, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, గోపాల్, తలారి రాములు, ప్రతాపరెడ్డి, దాసు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్




**దుబ్బాక/మిర్ దొడ్డి మేజర్ న్యూస్:**
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అనురాధ మాట్లాడుతూపోలీస్ స్టేషన్లో వివిధ కేసులలో ఉన్న వాహనాల యొక్క అడ్రస్ తెలుసుకుని సంబంధిత యజమానులకు త్వరగా అప్పగించాలని సంబంధిత ఎస్ఐలకు సూచించారు.బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సీసీటీఎన్ఎస్ ఆన్లైన్ డాటా ఏరోజుకారోజు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రజల రక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు.ఇసుక,జూదం, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సిడి ఫైల్స్, తనిఖీ చేశారు ప్రతి రికార్డ్ అప్డేట్ ఉండాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నీతి నిజాయితీగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.(విపిఓ) విలేజ్ పోలీస్ ఆఫీసర్ కేటాయించిన గ్రామాలకు కేటాయించిన వార్డులకు తరచుగా సందర్శిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని సూచించారు.విజబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని ఉదయం సాయంత్రం విసేబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు.సిబ్బంది విధి నిర్వహణతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. సమయం దొరికినప్పుడల్లా వాకింగ్ రన్నింగ్ యోగా చేస్తూ ఉండాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు.

పాత నేరస్తులైన కేడీలు డీసీలు సస్పెక్ట్ లను తరచుగా తనిఖీలు చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపి రవీందర్ రెడ్డి, దుబ్బాక సిఐ శ్రీనివాస్, ఎస్ బి ఇన్స్పెక్టర్ కిరణ్, మిరుదొడ్డి ఎస్ఐ సమత, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న జీవితం ఆదర్శనీయం

**కుకునూరుపల్లి,మేజర్ న్యూస్**



బహుజన ధీరుడు గోల్కొండ కీలాను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి వేడుకలు కుకునూరు పల్లి మండల కేంద్రంలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ బహుజన దళిత బడుగులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చునని నిరూపించిన గొప్ప సామాజిక బహుజన విప్లవకారుడు అని అన్నారు.17వ శతాబ్దంలో బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని తొలి బహుజన రాజస్థాపన చేసి కిలాష్పూర్ కేంద్రంగా చేసుకొని మొగల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, యువజన సభ్యులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రేగోడు మేజర్ న్యూస్:**



కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఆర్డిఓ రమాదేవి అన్నారు. సోమవారం రేగోడు మండలం లోని జగిర్యాల-కొండాపురం చెరువు అలుగు పొంగి పొర్లుతుండడంతో ఆర్డిఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలతో చెరువులు,కుంటలు నిండుకుండలా ఉండి పొంగిపొర్లుతున్నాయని రహదారులు జలమయం అయ్యాయని అత్యవసరం అయితే తప్ప ప్రజలు వర్షాల్లో బయటకు రావద్దని, పురాతన ఇండ్లు,మట్టి గోడలు ఉన్న ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్తే అధికారులు పునరావసం సెంటర్లకు తరలించి భోజన ఏర్పాట్లు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాలకు ఇండ్లు కూలిపోయిన వారు తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మెదక్ ఆర్డిఓ పేర్కొన్నారు. తాహసిల్దార్ దత్త రెడ్డి, గిర్దవార్ ఫేరోజ్ తో కలిసి మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు 10 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయని,132.6మీ.మీ ల వర్షపాతం నమోదయిందని తాహసిల్దార్ తెలిపారు.

## బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక



**కుకునూరుపల్లి,మేజర్ న్యూస్......**
మండల పరిధిలోని బొబ్బాయిపల్లి గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బోయిని కనకయ్య సోమవారం గాంధీభవన్లో సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. .ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని ప్రజల కోసం పనిచేస్తున్న నాయకత్వం కాంగ్రెస్తో సాధ్యమైతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వీరుపాక శ్రీనివాస్ రెడ్డి, కొండపాక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డమైన రవీందర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రెడ్డమైన రవి మాజీ ఎంపిటిసి తూం మహేందర్ మాజీ ఉపసర్పంచ్ కోల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ బాట లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

**మర్కుక్ మేజర్ న్యూస్:**



శ్రీ బాట లక్ష్మి నరసిహస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా మండలం లోని గణేష్ పల్లి గ్రామం దేవస్థానం లొ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి అధికార ప్రతినిధి భండారు శ్రీకాంత్ రావు పూర్ణ కుంభం తో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు . ఈ కార్యక్రమం లో తీగుల్ మాజి సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు, నాచారం దేవస్థాన డైరెక్టర్ కుచరం సంతోష్, హన్మంత రెడ్డి, కొండపోచమ్మ దేవస్థాన డైరెక్టర్ అశయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బునరీ రాజు, పూసల రవి, కాంగ్రెస్ నాయకులు వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు

## బహుజనులను ఏకం చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న

**మేజర్ న్యూస్, నంగునూరు: -**
గోల్కొండను స్వాధీనం చేసుకొని సాటిలేని యుద్ధ నైపుణ్యాలతో బహు జనులను, కులవృత్తులను ఏకం చేసిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని నంగునూరు పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ అన్నారు. నంగునూరు మండల కేంద్రంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతిని నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా నంగూనూరు గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు జాగీరు ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న చేసిన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోల మహేందర్ గౌడ్, కోల శ్రీధర్ గౌడ్, కోల ఉమాకర్ గౌడ్, బూరుగు నర్సిములు గౌడ్, కోల యాదగిరి గౌడ్, ఖాతా నర్సిములు గౌడ్, ముష్కీర్ పరశు రాములు గౌడ్, కోల సతీష్ గౌడ్, గోనేపల్లి శివగౌడ్, శ్రీనివాస్ గౌడ్, గోనేపల్లి సిద్దేశ్వర్ గౌడ్, కృష్ణ, వంశీ, రాము, కోల కనకయ్య గౌడ్, బూర్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా కార్యదర్శిగా ప్రసాది రవిశంకర్‌కు వీరశైవ లింగాయత సమాజం సన్మానం.

**సంగారెడ్డి మేజర్ న్యూస్.**



భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ప్రసాది రవిశంకర్ గారిని వీరశైవ లింగాయత సమాజం నాయకులు, పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని సమాజం తరపున ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఇప్పపల్లి నర్సింలు (ప్రెసిడెంట్), ప్రధాన కార్యదర్శి కొంక రాజేశ్వర్, నాయికోటి రామప్ప, మధు శేఖర్ ప్రసాది, శివ ప్రసాద్, వీరేశం, బత్తుల శ్రీనివాస్, సంపత్, పట్లోళ్ల మల్లికార్జున్, శివరాజ్, పోలీస్ సంతోష్, రాజేశ్వర్, అమర్నాథ్, అశోక్, అరుణ, మల్లికార్జున్, అస్కుల సతీష్, ప్రభు గారి నాగరాజు తదితర సమాజ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి జావిద్

**రేగోడు మేజర్ న్యూస్:**
కురుస్తున్న వర్షాల నేపథ్యం లో పత్తి పంటలను సోమవారం రేగోడు మండలంలోని దోసపల్లి,గజ్వాడా,పోచారం శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో మండల వ్యవసాయ అధికారి జావిద్ పరిశీలించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో నిలిచిన నీటిని మురుగు కాలువలు చేసి బయటకు పంపాలని, పై పాటి ఎరువులు, పురుగుల మందులు పిచికారి చేయకుండా తాత్కాలికంగా ఆపాలని,వర్షాలు తగ్గిన తరవాత పంట త్వరగా కోలుకోవడానికి, లీటరు నీటికి 5 గ్రా చొప్పున 19:19:19 ద్రావణాన్ని లేదాలీటరు నీటికి 5-10 గ్రాముల మల్టి కె ని పిచికారి చేయాలని తెలిపారు.పత్తిలో అధిక వర్షాల కారణంగా వడ తెగులు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు, లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి మొక్కల మొదళ్లలో తడిచే విధంగా పిచికారి చేయాలని తెలిపారు.వర్షాలు తగ్గిన తర్వాత పొలంలో అంతర కృషి చేయడం వల్ల కలుపు మొక్కలను తొలగించడంతో పాటుగా పొలంలో అధిక తేమను తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కావ్య, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రతీకగా బొల్లారం మున్సిపల్

## 2 కోట్ల 75 లక్షల రూపాయలతో ప్రతి వార్డులలో సిసి రోడ్లు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జిన్నారం మేజర్ న్యూస్:బొల్లారం**

పారిశ్రామికవాడగా పేరొందిన బొల్లారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైయస్సార్ కాలనీ, శక్తి ఎంక్లేవ్, శ్రీ రామ్ నగర్ కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, బీరప్ప బస్తి, జ్యోతి నగర్, మల్లన్న బస్తి, బాలాజీ నగర్, ఓల్డ్ విలేజ్, తదితర వార్డు లలో 2 కోట్ల 75 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బొల్లారం మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. స్థానిక నాయకుల ద్వారా నిరంతరం సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులోనూ మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొలన్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు , మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, వి.హనుమంత్ రెడ్డి, కమిషనర్ బి. కిషన్, మాజీ కౌన్సిలర్లు,వి. వేణు పాల్ రెడ్డి, గోపాలమ్మ, మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డ్ మెంబర్లు, టి. భాస్కర్, సి ఐ ఎం.రవీందర్ రెడ్డి , ఆర్ ఓ నర్సింలు, ఏఈ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పులిమామిడి రాజును పరామర్శించిన తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాష్ ముదిరాజ్

**సదాశివపేట సూర్య మేజర్ న్యూస్**



సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజును సోమవారం సదాశివపేట పట్టణంలోని పులిమామిడి రాజు నివాసంలో రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పులిమామిడి రాజును పరామర్శించారు. ఇటీవల పులిమామిడి రాజు యొక్క మాతృమూర్తి పులిమామిడి బాగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మాతృవియోగంతో ఉన్న పులిమామిడి రాజును, ఆయన కుటుంబ సభ్యులను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పరామర్శించి, తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం బండా ప్రకాష్ పులిమామిడి బాగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పులిమామిడి రాజకు గుండె ధైర్యం చెప్పారు.ఇట్టికార్యక్రమంలో డిప్యూటీ ఎంఆర్ఓ బాల్ రాజ్, ఆర్. ఐ గంగాధర్, మామిళ్ల రాజేందర్, పట్నం మాణిక్యం, ముదిరాజ్ సంఘం నాయకులు మన్సాన్ పల్లి నారాయణ, మాజీ సర్పంచ్ గాడిఖానా విజయ్, సతీష్ ముదిరాజ్,మందుల వరలక్ష్మి, చాపల హన్మంతు, కంది మల్లేష్, మునిపల్లి రమేష్, మాజీ కౌన్సిలర్ సాతాని శ్రీశైలం,బి.ఆర్.యస్ నాయకులు పిల్లిగుండ్ల వీరేశం, ముబీన్, పి. ఎం. ఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, తాలెల్మ రాము, మాలె శ్రీనివాస్, బగిలివిష్ణు, నర్సింలు గోల్డ్ స్మిత్, సోమశంకర్, అఖిల్ మొదలగు వారు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతులు అందజేసిన లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ

**రామచంద్రాపురం మేజర్ న్యూస్**




79 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా లయన్స్ క్లబ్ తెల్లాపూర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెల్లాపూర్ లో నిర్వహించినటువంటి వ్యాసరచన, వకృత్వ మరియు చిత్రలేఖన పోటీలలో విజేతులైనటువంటి పిల్లలకు ఈరోజు బహుమతి ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, లయన్స్ క్లబ్ తెల్లాపూర్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ మరియు సభ్యులు సుభాష్, రాజు, లక్ష్మీనారాయణ, రవీందర్, సాయి కిరణ్ దీపిక, మధుప్రియ, ఆశ, అవంతి మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలి.

**సంగారెడ్డి జిల్లా ప్రతి నిధి మేజర్ న్యూస్.**

జిల్లాలో భారీ వర్షాలు కారణంగా చెరువులు కుంటలు పూర్తిగా నిండిపోయాయని. మురుగు నీరు నిల్వ ఉండకుండా అధికారుల చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం వివిధ శాఖల అధికారుల తో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. .. జిల్లాలో భారీ వర్షాలు పడినందున గ్రామాలలో ఎక్కడ కూడా పూర్వ నీరు నిలవకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పంచాయతీరాజ్ సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రతి నాలుగు రోజులకు ఒకసారి తాగునీటిని బ్లీచింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో దోమల నివారణ కోసం అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అన్నారు కిరోసిన్ బాల్స్ వేయాలని సూచించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాలలో అప్రమత్తంగా ఉండి అవసరమైన అన్ని రకాల మందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సబ్ సెంటర్లలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఒది చర్యలు చేపట్టాలని సూచించారు.



# నీటి ప్రవహిత ప్రాంతాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి....

**మద్దూర్/దూల్మిట్ట,మేజర్ న్యూస్...**

మద్దూర్ దూల్మిట్ట మండల కేంద్రాలతో పాటు మండలంలోని గ్రామాలలో నీటి ప్రవాహిత ప్రాంతాల పట్ల ప్రజలు రైతులు వాహనదారుడు అప్రమత్తంగా ఉండాలని దూల్మిట్ట తహసిల్దార్ సింహాచలం మధుసూదన్, మద్దూర్ తహసిల్దార్ ఎజీ రహీం, ఎస్సై షేక్ మహబూబ్ అలీ, లు సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల నీటి ప్రవాహంతో చెరువుల కుంటలు నిండి మత్తడులు అలుగులు పారాడంతో నీటి ప్రవాహం అధికమై వాగులు చెక్ డ్యాములు మత్తడులు పొంగిపొర్లాడంతో నీటి ప్రవాహం అధికమై ప్రమాదాలు పొంచి ఉన్నాయని అన్నారు. నీటి ప్రవాహం సంభవించిన ప్రాంతాల నుంచి వాహనదారులు ప్రయాణికులు వెళ్లకూడదని సూచించారు. నేడు కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం దూల్మిట్ట చెక్ డ్యామ్ వద్ద దూల్మిట్ట తహసిల్దార్ సింహాచలం మధుసూదన్ చెక్ డ్యామ్ నుండి ఎవరు ప్రయాణించకుండా సహాయక చర్యలు చేపట్టారు.

# సదాశివపేటలో పీస్ కమిటీ సమావేశం

**సదాశివపేట సూర్య మేజర్ న్యూస్**

వినాయక నవరాత్రులను పురస్కరించుకొని పీస్ కమిటీ సమావేశం సోమవారం ఎన్ గార్డెన్లో జరిగింది. ఈ సమావేశానికి వినాయక మండపాల భాద్యులు హాజరయ్యారు.ఈ సమావేశం లో చింత గోపాల్,సంగారెడ్డి డిఎస్పీ సత్యన్న, సదాశివపేట సీఐ వెంకటేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.వినాయక నవరాత్రి వేడుకలు ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అలాగే శాంతి భద్రతల సమస్య రాకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.లౌడ్ స్పీకర్లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని కోరారు.

